

## వైభవంగా అయ్యప్ప మహాపడిపూజ

**పాల్గొన్న కార్పొరేటర్ మాధవరం..**

వివేకానందనగర్ డివిజన్ వెంకటేశ్వరనగర్ బ్లాక్ నంబర్ 35లో సోమవారం జరిగిన అయ్యప్ప పూజలో కార్పొరేటర్ మాధవరం రోజాదేవి, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజాదికాలను నిర్వహించారు. ప్రజలందరినీ అయ్యప్ప స్వామి చల్లగా చూడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎర్ర లక్ష్మయ్య, స్వాములు పాల్గొన్నారు.

*– మియాపూర్, డిసెంబర్ 16*

# క్రైస్తవులకు అండగా కేసీఆర్

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్
- కూకట్‌పల్లిలో ఘనంగా క్రిస్మస్ సంబురాలు
- పాస్టర్లకు కానుకల పంపిణీ



కూకట్‌పల్లిలో క్రిస్మస్ వేడుకల్లో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, కార్పొరేటర్లు, చర్చిల పాస్టర్లు, తదితరులు

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 16: సర్వమతాలకు సమప్రాధాన్యతనిచ్చి, ఆయా మతాల పండుగలను అధికారికంగా నిర్వహించి.. ప్రభుత్వ కానుకలను అందించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ కుర్మయ్యగారి నవీన్‌కుమార్ అన్నారు. గతంలో క్రిస్మస్ పండుగను అధికారికంగా నిర్వహించి కానుకలను అందించామని, నేడు కాంగ్రెస్ పాలనలో పండుగలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. సోమవారం కూకట్‌పల్లి డివిజన్ శేషాద్రినగర్ కమ్యూనిటీ హాల్‌లో బీఆర్‌ఎస్ పార్టీ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు డేవిడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ కుర్మయ్యగారి నవీన్‌కుమార్ పాల్గొన్నారు. క్రిస్మస్ కేక్‌ను కట్‌చేసి, నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించి, సొంత నిధులతో చర్చిల పాస్టర్లకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో అన్ని మతాలకు చెందిన పండుగలను అధికారికంగా నిర్వహించడం జరిగిందన్నారు. క్రిస్మస్, రంజాన్ పండుగలతో పాటు బతుకమ్మ పండుగలకు ప్రభుత్వం దుస్తువులను పంపిణీ చేసిందన్నారు. ఆయా మతాల సాంప్రదాయాలను గౌరవిస్తూ అందరికి సమప్రాధాన్యతనిచ్చిందన్నారు. కానీ... నేడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం పండుగలకు కానుకలను అందించకపోవడం బాధకరమన్నారు. ప్రభుత్వం నుంచి కానుకలను ఇవ్వకున్నా... గత సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ... పాస్టలందరికీ దుస్తులను అందిస్తున్నట్లు తెలిపారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని క్రిస్టియన్లను ఎల్లప్పుడు అండగా ఉంటానని, ఎవరైనా ఇబ్బందులు కలిగిస్తే.. నేను ముందుండి పోరాడుతానన్నారు. క్రిస్టియన్ పాస్టర్లు సమావేశాలు నిర్వహించుకోవడానికి, పేదలను ఆదుకోవడానికి ఎల్లప్పుడు సహకారాన్ని అందిస్తానన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ అన్ని వర్గాలకు అండగా ఉంటుందని, భవిష్యత్‌లో బీఆర్‌ఎస్ పార్టీయే అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పాస్టర్ ఐజాక్, కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, ఆవుల రవీందర్‌రెడ్డి, మందడి శ్రీనివాస్‌రావు, పండాల సతీశ్‌గౌడ్, సబీహాగౌసుద్దీన్, పగుడాల శిరీషాబాబురావు, మహేశ్వరిశ్రీహరి, రోజా రంగారావు, మాజీ కార్పొరేటర్లు తూము శ్రావణ్‌కుమార్, పగుడాల బాబురావు, బీఆర్‌ఎస్ పార్టీ నేతలు సతీష్‌రావు, పి.ఐజాక్, డేవిడ్, సువార్తమ్మ, రాజు, విజయపాల్, జాన్‌పాల్, లాల్‌బాబు, దేవదానం, స్యామ్‌సన్, సుధాకర్ తదితరులు ఉన్నారు.



కూకట్‌పల్లి జోన్ ఆఫీస్ ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న జడ్సీ అపూర్వ్‌చౌహాన్

## ప్రజావాణికి.. 32 ఫిర్యాదులు

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 16: కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 14 ఫిర్యాదులు వచ్చినట్లు జడ్సీ అపూర్వచౌహాన్ తెలిపారు. సోమవారం జోన్ ఆఫీస్‌లో నిర్వహించిన ప్రజావాణిలో టౌన్‌ప్లానింగ్ విభాగానికి 6 ఫిర్యాదులు, ఇంజినీరింగ్ విభాగానికి 3, యుబీడీ విభాగానికి 4, ఎస్‌డబ్ల్యూఎం విభాగానికి 1, స్పోర్ట్స్ విభాగానికి 1 వచ్చినట్లు తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి.. ఆయా సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఎస్ఈ చిన్నారెడ్డి, సీపీ గణపతి, ఆయా విభాగాల జోనల్ అధికారులు పాల్గొన్నారు.

### జంట సర్కిళ్ల కార్యాలయంలో...

కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ల కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 18 ఫిర్యాదులు వచ్చాయి. మూసాపేట సర్కిల్ కార్యాలయంలో 9 ఫిర్యాదులు రాగా.... టౌన్‌ప్లానింగ్ విభాగానికి 8 ఫిర్యాదులు, రెవెన్యూ విభాగానికి 1 ఫిర్యాదులు వచ్చాయి. కూకట్‌పల్లి సర్కిల్ కార్యాలయంలో 9 ఫిర్యాదులు రాగా... టౌన్‌ప్లానింగ్ విభాగానికి 5, రెవెన్యూ విభాగానికి 1, యుబీడీ విభాగానికి 1, ఎలక్ట్రికల్ విభాగానికి 1, శానిటేషన్ విభాగానికి 1 ఫిర్యాదులు వచ్చాయి. ఆయా ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి... చర్యలు తీసుకుంటామని డీసీలు వంశీకృష్ణ, గంగాధర్ తెలిపారు.

### ప్రజావాణిలో పలు సమస్యలపై డీసీ మల్లారెడ్డికి ఫిర్యాదులు

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 16: కుత్బుల్లాపూర్–గాజులరామారం జంట సర్కిళ్ల కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో గాజులరామారం డీసీకి ప్రముఖ పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్ వివిధ ఫంక్షన్‌హాల్, హోటల్ సముదాయాల్లో ప్లాస్టిక్ నియంత్రణపై తీసుకుంటున్న చర్యలపై సమాచార హక్కు చట్టం ద్వారా వెల్లడించాలని ఫిర్యాదు చేశారు. గాయత్రినగర్, బృందావన్ కాలనీలో స్వీపర్లు రావడం లేదంటూ ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా కాలనీల ప్రతినిధులు అచ్చుత్‌వర్ధన్, విజయభాస్కర్, శ్రీరాములు, శ్రీనివాసరెడ్డి, మహేశ్‌కుమార్, రాజారెడ్డి, శివరావు, రామరాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

### జగద్గిరిగుట్ట భూదేవిహిల్స్ కబ్జాలపై చర్యలు తీసుకోండి

జగద్గిరిగుట్ట, డిసెంబరు 16: జగద్గిరిగుట్ట భూదేవిహిల్స్‌లో కబ్జాలపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నేతలు కోరారు. ఈమేరకు కలెక్టరేట్ ప్రజావాణిలో సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ప్రభుత్వ, ప్రైవేటు భూములు ఓవర్‌ల్యాపింగ్ సమస్య కొందరు తమకు అనుకూలంగా మార్చుకున్నారని తెలిపారు. స్థలాన్ని చదును చేసి ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారని ఫిర్యాదు చేశారు. సర్వేచేయాలని ఆదేశాలున్నా.. రెవెన్యూ అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవడంలేదని ఉమామహేశ్, హరినాథ్ తెలిపారు.

### ప్రజావాణి ఫిర్యాదులపై తక్షణ చర్యలు

మియాపూర్, డిసెంబర్ 16: ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులతో పాటు వినతులపై తక్షణ చర్యలు తీసుకుంటామని చందానగర్ సర్కిల్ డీసీ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉండి ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా మియాపూర్ వీడియా కాలనీలో అనుమతులకు మించి చేపడుతున్న అక్రమ నిర్మాణంతో పాటు, ఒకే ప్రాపర్టీకి రెండు సార్లు ఆస్థిపన్ను చెల్లింపుపై ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ.. వచ్చిన వినతులను సంబంధిత విభాగాలకు పంపి క్షేత్రస్థాయిలో తక్షణ చర్యలకు ఆదేశిస్తున్నామన్నారు. ప్రజావాణిలో ఏసీపీ మోహన్‌రెడ్డి, టీపీఎస్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇంటి దరఖాస్తులు క్షేత్రస్థాయిలో విచారణ

ప్రజాపాలన దరఖాస్తుల్లో భాగంగా జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు చందానగర్ సర్కిల్‌లో ఇందిరమ్మ ఇంటి దరఖాస్తులపై మంగళవారం నుంచి క్షేత్రస్థాయి విచారణ ప్రారంభిస్తున్నట్లు డీసీ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సర్కిల్ పరిధిలో సుమారు 10 వేల వరకు దరఖాస్తులు గతంలో అందాయని, వాటిని వార్డుల వారీగా విభజించి దరఖాస్తుదారుల ఇంటి వద్దకు వెళ్లి తగు విచారణ చేపడుతారన్నారు. సర్కిల్ పరిధిలో 32 బృందాలను ఇందుకోసం నియమించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలాలు, ఇతర నిషేధిత స్థలాల్లో ఇందిరమ్మ ఇండ్ల పథకానికి సాయం అందించబోమన్నారు. అర్హత కలిగి సొంత ఇంటి స్థలం కలిగి ఉన్న దరఖాస్తుదారుకి నాలుగు దశలుగా రూ.5లక్షలను ఇంటి నిర్మాణం నిమిత్తం ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తుందని తెలిపారు.

### రోడ్డు మూసేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

దుండిగల్, డిసెంబర్ 16: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, 30వ డివిజన్ జర్నలిస్ట్ కాలనీలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల ఎదురుగా లత లేక్‌వ్యూ అపార్ట్‌మెంట్‌వాసులు అక్రమంగా రోడ్డును మూసివేసి, వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని సోమవారం జర్నలిస్ట్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ప్రజావాణిలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అధికారులు తక్షణమే స్పందించి అపార్ట్‌మెంట్ ముందర వేసిన సిమెంట్ కుర్చీ దిమ్మెలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు.



అయ్యప్పస్వాముల ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ

## మాలధారణతో.. క్రమశిక్షణతో కూడిన జీవితం

దుండిగల్, డిసెంబర్ 16: మాలధారణతో మనిషిలో క్రమశిక్షణతో కూడిన జీవితం అలవడుతుందని కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ తెలిపారు. మల్లంపేట్‌లోని హనుమాన్ ఆలయ ప్రాంగణంలో సోమవారం జరిగిన అయ్యప్ప స్వాముల ఇరుముడిలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అర్కల అనంతస్వామి, బీఆర్‌ఎస్ నాయకులు హనుమంతరావు, జక్కుల శ్రీనివాస్‌యాదవ్, సీనియర్ నాయకులు ధర్మారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ అమర్నాథ్, 24,25వ వార్డుల అధ్యక్షులు రమేశ్, లక్ష్మణ్, మాజీ వార్డు సభ్యులు నరసింహ, నాయకులు కుంట్ల నందు, అనిల్, కోటేశ్, ప్రశాంత్, విష్ణు, నరేశ్, అరుణ్‌తో పాటు స్థానిక నాయకులు, గురుస్వాములు, అయ్యప్ప మాలధారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించాలని వినతులు

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ సంక్షేమసంఘాల సభ్యులు సోమవారం కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి.. తామ ఎదుర్కొంటున్న పలు సమస్యలను వివరించడంతో పాటు వాటిని పరిష్కరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన శంభీపూర్ కృష్ణ సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

## నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలి


- బల్దియా కమిషనర్ ఇలంబర్తి
- గచ్చిబౌలి ఫ్లై ఓవర్ పనులు పరిశీలన



గచ్చిబౌలి ఫ్లై ఓవర్ సమీపంలో సర్వీసు రోడ్డు నిర్మాణ పురోగతిని కమిషనర్ ఇలంబర్తికి వివరిస్తున్న జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి


మియాపూర్, డిసెంబర్ 16: గచ్చిబౌలి ఫ్లై ఓవర్ నిర్మాణ పనుల్లో మరింత వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలని బల్దియా కమిషనర్ ఇలంబర్తి పేర్కొన్నారు. స్లాబ్‌లు సహా అనుసంధానమైన పనులు జాప్యం లేకుండా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సోమవారం శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని గచ్చిబౌలి ఫ్లై ఓవర్ నిర్మాణ పనులను జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, ప్రాజెక్టు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఫ్లై ఓవర్ నిర్మాణ పనుల పురోగతితో పాటు సర్వీసు రోడ్డు నిర్మాణం, ఆస్తుల సేకరణ అంశాలను జడ్సీకి వివరించారు. హెచ్ఎండబ్ల్యూఎస్ బ్యాలెన్స్ యుటిలిటీ షిఫ్ట్‌కు చర్యలు తీసుకోవాలని సదరు విభాగంతో సమన్వయం చేస్తున్నట్లు, పూర్తి కాగానే సర్వీస్ రోడ్డు పనులను మరింత వేగవంతంగా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ.. పియర్స్ క్యాప్, డెక్ స్లాబ్ కాస్టింగ్ నిర్మాణ పనుల వేగం చేయాలని, సర్వీసు రోడ్డు పనులకు ఆటంకంగా ఉన్న ఆస్తుల సేకరణను చేపట్టాలని ఆదేశించారు. గచ్చిబౌలి కూడలిని మరింత విస్తరించటం ద్వారా ట్రాఫిక్ ఫ్రీగా తీర్చిదిద్దాలన్నారు. రహదారి విస్తరణలో అడ్డుగా ఉన్న కొండాపూర్ ప్రభుత్వ పాఠశాలకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. అన్ని విభాగాలను సమన్వయం చేసుకుంటూ పనులను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు సీఈ దేవానంద్, డీసీ ముకుందారెడ్డి, సీపీ శ్యాంకుమార్, రోడ్ వైడనింగ్ అధికారి రవీందర్, ఏసీపీ వెంకటరమణ, ఈఈ మల్లికార్జున్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కాలనీల అభివృద్ధికి నిధులివ్వండి..



జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తికి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్లు సతీశ్‌గౌడ్, మందడి శ్రీనివాస్‌రావు, రవీందర్‌రెడ్డి

బాలానగర్/కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 16: ఫతేనగర్ డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తికి విజ్ఞప్తి చేశారు. సోమవారం జీహెచ్ఎంసీ కార్యాలయంలో ఆయనను కలిసి ఫతేనగర్, బాలానగర్, కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించాలని కార్పొరేటర్లు సతీశ్‌గౌడ్, మందడి శ్రీనివాస్‌రావు, కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. కాలనీలో ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు నిధులను కేటాయించాలని కోరారు. కాలనీలో పలు సమస్యలను విరించగా... ఆయా సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బాచుపల్లి, మల్లంపేట్, నిజాంపేట్, ప్రగతినగర్ ఎంపీటీసీగా పనిచేసిన స్వర్గీయ కాసాని కృష్ణ ముదిరాజ్ 18వ వర్ధంతి సందర్భంగా సోమవారం ఆయన విగ్రహానికి పలువురు నివాళులర్పించారు. కార్యక్రమంలో నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, కార్పొరేటర్ కాసాని సుధాకర్ ముదిరాజ్, యువ నాయకులు కాసాని వీరేశ్ ముదిరాజ్, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేటర్లు బాలాజీ నాయక్, వీరేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

*– దుండిగల్, డిసెంబర్ 16*

## పాండురంగనగర్ కాలనీ అధ్యక్షుడిగా వంశీకృష్ణ

బాలానగర్, డిసెంబర్ 16: పాండురంగనగర్ కాలనీ అధ్యక్షుడిగా వంశీకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మూసాపేట డివిజన్ పరిధి పాండురంగనగర్‌కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా వంవీకృష్ణ మాత్రమే నామినేషన్ వేయడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన అజయ్ సింగ్, సురేందర్‌గౌడ్, చందర్‌రావు ప్రకటించారు. కాలనీ అధ్యక్షుడిగా వంశీకృష్ణను నియమించాలని బావించిన కాలనీవాసులు నామినేషన్‌లో పాల్గొనలేదు. తప్పలితంగా వంశీకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు వంశీకృష్ణ మాట్లాడుతూ.. కాలనీవాసులందరి సహకారంతో అధ్యక్షుడిగా ఎన్నికైనందుకు అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. కాలనీవాసులు తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా కాలనీ సంక్షేమం కోసం నిర్విరామంగా కృషి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాలనీవాసుల సంక్షేమం కోసం దృష్టి సారించి కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఉదయ్‌కుమార్, ఇందర్‌సింగ్, రామాంజనేయులు, శ్రీనివాస్‌గౌడ్, సుబ్బరాయుడు, వాసు, లలిత్ మోహన్, పరిమళ, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణకు అపారమైన అవకాశాలు

మాదాపూర్, డిసెంబర్ 16: ఎనర్జీ పరంగా తెలంగాణకు అపారమైన అవకాశాలు ఉన్నాయని, తెలంగాణ సామర్థ్యం అద్వితీయమని టీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ అన్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో ఆదివారం సాయంత్రం టీఎస్‌పీడీసీఎల్ (తెలంగాణ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్) ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ క్లీన్ ఎనర్జీ పేరుతో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సుకు ముఖ్య అతిథిగా టీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎనర్జీ పరంగా తెలంగాణకు అపారమైన అవకాశాలు ఉన్నాయని, తెలంగాణ సామర్థ్యం అద్వితీయమన్నారు. ఇది భూ పరివేష్టిత రాష్ట్రమని, నిర్దిష్ట ప్రయోజనాలు, సవాళ్లను కలిగి ఉందన్నారు. భారతదేశంలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఇదేనన్నారు. విద్యుత్ నుంచి గ్రీన్ ఎనర్జీకి మారడం కూడా సవాలుగా మారడానికి ఇదే కారణమన్నారు. ఒక స్టార్టప్ ద్వారా తీసుకువచ్చిన ఏఐ ఆధారిత ప్లాట్‌ఫామ్‌ను ఆవిష్కరించారు. శక్తిని ఆదా చేయడానికి, విద్యుత్ బిల్లులను తగ్గించడానికి వినియోగదారులను శక్తివంతం చేస్తుందన్నారు. భారత ప్రభుత్వం సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ మద్దతుతో తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) యొక్క ఎనర్జీ కమిటీ క్లీన్ ఎనర్జీపై ఎంఎస్ఎంఈల కొరకు అంతర్జాతీయ సదస్సును నిర్వహించినట్లు తెలిపారు. భారతదేశం నలుమూలల నుంచి 400 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సదస్సు జర్మనీ, థాయ్‌లాండ్, శ్రీలంక నుంచి అంతర్జాతీయ వక్తలను విశేషంగా ఆకర్షించినట్లు నిర్వాహకులు అన్నారు.

## వేతన ఒప్పందాన్ని అమలు చేయాలి




నిరసన ర్యాలీలో పాల్గొన్న సీఐటీయూ నేతలు, కార్మికులు

దుండిగల్, డిసెంబర్ 16: జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంలోని దీపక్ నైట్రేట్ యూనిట్–2 యాజమాన్యం 22నెలల నుంచి కార్మికుల వేతన ఒప్పందం అమలు చేయకుండా కాలయాపన చేయడాన్ని నిరసిస్తూ సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో పలువురు కార్మికులు సోమవారం షాపూర్‌నగర్ రైతు బజార్ నుంచి దీపక్ నైట్రేట్ యూనిట్–2 వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఎర్ర అశోక్, కుత్బుల్లాపూర్ మండలం కన్వీనర్ కీలుకాని లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దీపక్ నైట్రేట్ యూనిట్–2, యాజమాన్యానికి 22 నెలల క్రితం కార్మికుల వేతనాల పెరుగుదల గురించి డిమాండ్ నోటీసు ఇవ్వడం జరిగిందని.. యాజమాన్యం కార్మిక నాయకుల్ని చర్చలకు పిలిచినప్పటికీ అంగీకరించిన ఒప్పందాలను అమలు చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. దీంతో కార్మికులు తీవ్రమైన ఇబ్బందుల్లో ఉన్నారని, ఇక్కడున్న కంపెనీ జనరల మేనేజర్ నియంతలా వ్యవహరిస్తూ, కార్మికుల సహనాన్ని పరీక్షిస్తున్నాడని, కార్మికుల ప్రాణాలను ఫణంగా పెట్టి కెమికల్ కంపెనీల్లో విధులు నిర్వహిస్తూ కంపెనీకి వందల కోట్లు రూపాయలు లాభాలు తెచ్చి పెడుతుంటే కంపెనీ యాజమాన్యం మాత్రం కంపెనీ ఉత్పత్తుల పెరుగుదల మీద ఉన్న ఆలోచన కార్మికుల వేతన ఒప్పందాల మీద చూపడంలేదన్నారు. వేతనాలు పెంచకుండా కార్మికుల కుటుంబాలతో ఆటలాడుతుందని ఆరోపించారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి వెంటనే వేతన ఒప్పందం చేయాలని.. లేని పక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న కార్మిక వర్గాన్ని సమీకరించి ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు పసుల అంజయ్య, ఈ.దేవదానం, రావుల స్వాతి, ప్రసాద్, కే.శ్రీను, ఖలీల్, షఫీ, వినయ్, గోపాల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతిక పరిజ్ఞానంతోనే భావితరాల అభివృద్ధి



ప్రదర్శనను తిలకిస్తున్న ట్రస్మా ప్రతినిధులు

జగద్గిరిగుట్ట, డిసెంబర్ 16: విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమని మేడ్చల్ జిల్లా ట్రస్మా అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి సూచించారు. రంగారెడ్డినగర్ బ్రైట్‌కాన్సెప్ట్ హైస్కూల్‌లో సోమవారం స్టూడెంట్ లీడ్ కాన్ఫరెన్స్‌ను చైర్మన్ వినోద్‌జాదవ్‌తో కలిసి ప్రారంభించారు. చదువులో ప్రయోగవిధానం, సృజనాత్మకత జోడిస్తే ఉన్నతంగా నిలుస్తారన్నారు. ప్రదర్శనలో ప్రతిభ కనబరచిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ట్రస్మా, లీడ్ సంస్థ ప్రతినిధులు బిర్రు ఆంజనేయులు, బాలరాజ్‌గౌడ్, శ్యాం, భూపాల్‌రెడ్డి, నర్సింహులు, దయాకర్, మునిచౌదరి, మధు, ప్రసన్నకుమార్, శ్రీశైలం, ఆయేషా పాల్గొన్నారు.



బహదూర్‌పల్లి సాయినాథ్ సొసైటీలో అక్రమ నిర్మాణాలను జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం

## అక్రమ నిర్మాణాల కూల్చివేత

దుండిగల్, డిసెంబర్ 14: గండిమైసమ్మ–దుండిగల్ మండల పరిధిలోని బహదూర్‌పల్లిలోని ప్రభుత్వ భూమి సర్వేనంబర్ 227లో వెలసిన అక్రమ నిర్మాణాలను అధికారులు సోమవారం కూల్చివేశారు. బహదూర్‌పల్లిలోని సర్వేనంబర్ 227 సాయినాథ్ సొసైటీలో కొన్ని రోజులుగా అక్రమంగా నిర్మాణాలు జరుగుతున్నట్లు జల్లా అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో జిల్లా జాయింట్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు జేసీబీ సహాయంతో గండిమైసమ్మ–దుండిగల్ రెవెన్యూ సిబ్బంది రెండు గదులు, ఓ షెడ్డుతో పాటు పలు బేసిమెంట్లు, కంటైనర్లను నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు ఉపేక్షించేది లేదని తెలిపారు

## బీఏ ఓరియంటల్ లాంగ్వేజెస్ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 16: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఏ ఓరియంటల్ లాంగ్వేజెస్ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 4వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.